పడిపోయిన ధాన్యం దిగుబడి

ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. అప్పులు చేసి ఎన్నో ఆశలతో రబీ సీజన్‌లో వరి పంట సాగు చేశారు. వరుస తుపానులు కారణంగా భారీ వర్షాలు కురిశాయి. దీనికితోడు తెగుళ్లు విజృంభించాయి. దీంతో పంట దిగుబడి సగానికి పైగా పడిపోయింది. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నేలపట్టు గ్రామంలో వర్షానికి పడిపోయిన వరి

- వరుస తుపానులు, తెగుళ్లే కారణం
- ప్రారంభమైన వరి కోతలు
- ధాన్యానికి గిట్టుబాటు ధర వస్తుందో లేదోనంటున్న రైతులు

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు, ఏకొల్లు, ఎన్‌ఎం అగ్రహారం, అక్కరపాక, గొల్లపాళెం, పోలిరెడ్డిపాళెం, వేణుంబాకం, పూలతోట, సేదనమల్లి, సింగనాలత్తూరు, ఆనేపూడి, కల్లూరు, మీజూరు తదితర గ్రామాల్లో రబీ సీజన్‌లో నాలుగు వేల హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరు నుంచి నవంబర్, డిసెంబర్ నెలల్లో వరుస తుపానులు ఏర్పడ్డాయి. దీంతో భారీ వర్షాలు కురిశాయి. ఈ క్రమంలో పంటలు దెబ్బతిన్నాయి. దీనికితోడు వరి పంటను అగ్గితెగులు, నల్ల మచ్చ తదితర తెగుళ్లు ఆశించడంతో పంట ఎదుగుదల తగ్గింది. ఈ క్రమంలో మండలంలోని వెదరుపట్టు, ఏకొల్లు, ఎన్‌ఎం అగ్రహారం, అక్కరపాక, గొల్లపాళెం, పోలిరెడ్డిపాళెం, వేణుంబాకం, తదితర గ్రామాల్లో గత వారం నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

ఈ దఫా రబీ సీజన్‌లో వర్షాలు పుష్కలంగా కురవడంతో రైతులు ఎన్నో ఆశలతో గతంలో కంటే ఎక్కువగా 4 వేల హెక్టార్లకు పైగా వరి పంట సాగు చేశారు. వరి నాట్లకు ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు చేశారు. ఎలిది సాగుకు రూ.25 వేలు వరకు ఖర్చుపెట్టారు.



వేణుంబాకం గ్రామంలో యంత్రంతో వరి కోత

ఎకరాకు దిగుబడి 22–25 బస్తాలే...

అకాల వర్షాలు కురవకుండా ఉండి ఉంటే ఎకరాకు 40 బస్తాల పైగా దిగుబడి వచ్చి అధిక లాభాలు వచ్చేవని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభం నుంచే ముఖ్యంగా వరి పంట పొట్ట దశ, ఎన్నుతీసే దశలో అకాల వర్షాలు కురవడంతో బాగా దెబ్బతినిందని, దిగుబడులు బాగా తగ్గిపోయినట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎకరాకు 22–25 బస్తాలు ధాన్యం మాత్రమే దిగుబడి వచ్చినట్టు వెదురుపట్టు, అక్కరపాక, కుప్పారెడ్డిపాళెం తదితర గ్రామాల తెలిపారు.

పలుమార్లు అకాల వర్షాలు కురవడంతో బాగా పండిన వరి పంట నేలవాలిపోయింది. దీంతో పండిన ధాన్యం నేలపాలవడంతో పాటు చాలా వరకు పంట దెబ్బతినింది. రైతు ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు. భారీ నష్టాన్ని చవిచూడక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టువాపల్లి, పూలతోట, సింగనాలత్తూరు, నేలపట్టు, గల్లపాళెం, పోలిరెడ్డి, అక్కరపాక తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లోని వరి పంట ఇప్పటికీ నీటిలో ఉంది. కట్టువాపల్లి, సింగనాత్తూరు, మేలనాలత్తూరు, పూలతోట, కరటాముడి గ్రామాల్లో అధికారులు పర్యటించి పంట నష్టం అంచనా వేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కలువాయి: కలువాయి పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ బుధవారం విచారణ జరిపారు. కలువాయి మండలం వెరుబొట్లపల్లికి చెందిన కోలా వంశీ మరో యువకుడితో కలిసి ఈ నెల 18న బైక్‌లో వెళుతుండగా గేదెలు అడ్డు వచ్చాయి. వంశీ హారన్ కొట్టాడు. ఎందుకు హారన్ కొట్టావు, గేదెలు పొలంలో పడ్డాయి అంటూ గ్రామానికి చెందిన సంకల పవన్, మరో ఐదుగురు అతన్ని కులం పేరుతో దూషించి దాడి చేశారు. దీనిపై వంశీ పోలీసులకు ఫిర్యాదు మేరకు కలువాయి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ వేణుగోపాల్ బాధితులను కలువాయికి పిలిపించి మాట్లాడారు. గ్రామానికి వెళ్లి విచారించారు.

కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

కోట : మండలంలోని చిట్టేడు పీహెచ్‌సీ పరిధిలో వున్న గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్లు డాక్టర్ నాగరాజు బుధవారం తెలిపారు. ఇద్దరు డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు సర్వేలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 9 గ్రామాల్లో పది మంది అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపినట్లు తెలిపారు.

కండలేరులో 55.424 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 55.424 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 150, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

యువతి వివాహానికి చేయూత



సామగ్రి అందజేస్తున్న బలిజ సంఘం మహిళా ప్రతినిధులు

చిల్లకూరు : తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ వద్ద ఉంటున్న యువతి వివాహానికి చేయూత ఇచ్చేందుకు గూడూరుకు చెందిన బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు ముందుకు వచ్చారు. బుధవారం గూడూరులోని సంఘం కార్యాలయంలో ఆ యువతికి పట్టు చీరలు, అత్తవారి ఇంటికి తీసుకు వెళ్లే సాంగ్యాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షురాలు రఘుతం పద్మావతి మాట్లాడుతూ సైదాపురం మండలం ఆర్‌ఆర్ పురానికి చెందిన మోపూరు చందన తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుందన్నారు. ఆమెకు వివాహం జరిపించేందుకు సాయం చేయాలని అమ్మమ్మ తమను కోరినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో యువతికి చేయూత ఇచ్చినట్టు వివరించారు. భవిష్యత్తులో కూడా సాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు సారంగం సులక్ష్మీ, ఇస్కా సువర్ణలక్ష్మీ, గునసాని అరుణ, ఉమాదేవి, ఉషా, సరోజా తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ఫలసాయం వేలంలో రూ.15.5 లక్షల ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : మండలంలోని పెట్లూరు సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలోని చీని, నిమ్మ పరిశోధనా స్థానంలో ఆధ్వర్యంలో బుధవారం నిమ్మ ఫలసాయం వేలం పాటలు నిర్వహించారు. ఇందులో రూ.15.5 లక్షల ఆదాయం వచ్చినట్టు ప్రధాన శాస్త్రవేత్త శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 22 నుంచి ఆగస్టు 31 వరకు 940 నిమ్మ చెట్ల నుంచి కాయలు కోసుకునే హక్కు కోసం వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో పెట్లూరు గ్రామానికి చెందిన జగదీష్‌యాదవ్ రూ.15.05 లక్షలకు పాట దక్కించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా సపోటాను చలపతి రూ.25 వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు. చీని, నిమ్మ పరిశోధనా స్థానం తిరుపతి ప్రధాన శాస్త్రవేత్త మధుమతి, సీనియర్ శాస్త్రవేత్త కవిత, నాయక్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో సమస్యరక్షణతో లాభాలు



పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరి రూరల్ : రైతులు పంటల సాగులో సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడితో పాటు లాభాలు ఆర్జించవచ్చని ఏడీఏ నాగార్జున సాగర్ తెలిపారు. మండలంలోని చిన్నపరెడ్డిపల్లి, కె.ఉప్పరపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిపంట సాగుపై రైతులకు పలు సలహాలు, సూచనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటకు ఆకుముడత (తెల్లతెగులు) సోకే ప్రమాదం ఉందని, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పొట్ట దశలో ఉన్న పంటకు ప్రొపికోనజోలన్ 200 మిల్లీలను పోషనోపాస్ 400 మిల్లీలతో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048 పంట ఎన్ను ముదిరే సమయంలో మెడవిరుపుడు వచ్చే ప్రమాదం ఉందని, ముందస్తుగా ట్రైసైక్లోజోల్ (బీమ్, బాన్, సివిక్‌ప్లాక్) మందును ఎకరాకు 120 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా గురువారం నుంచి సామూహిక ఎలుకలు నివారణ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుజాత, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అదాని ఫౌండేషన్ తోడ్పాటు



మత్స్యకార మహిళలతో ఫౌండేషన్ ప్రతినిధులు

చిల్లకూరు/వెంకటగిరి రూరల్ : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అదాని ఫౌండేషన్ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారు బుధవారం తమ్మినపట్నంలోని గమ్మళ్లదిబ్బ మత్స్యకార మహిళలకు వెంకటగిరిలోని కేవీకేలో చిక్కీల తయారీపై శిక్షణ ఇచ్చారు. అలాగే వాటిని మార్కెటింగ్ చేయడంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మత్స్యకార మహిళలు చేపల వేట లేని సమయంలో ఖాళీగా ఉండాల్సి వస్తుందన్నారు. దీంతో కుటుంబ పోషణ కష్టమవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వేరుశనగ చిక్కీలు తయారు చేసి మార్కెటింగ్ చేయడంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు గాను వెంకటగిరిలోని కృషి విజ్ఞాన్ కేంద్రంలో రెండు రోజులు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి, అదాని ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా రాణించాలి



దుస్తులు అందుకున్న విద్యార్థులతో జిల్లా అధికారిణి ఎస్తేరు గీత

నాయుడుపేట టౌన్ : గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యలో రాణించాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయ కర్త ఎం.ఎస్తేరు గీత పిలుపునిచ్చారు. నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రు లు లేని 100 మంది విద్యార్థులకు దుస్తులు, పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేశారు. గీత చేత లు మీదుగా పంపిణీ చేశారు. వాటిని గురుకులంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బందిలి శేఖర్‌బాబు చొరవతో సుబ్బారెడ్డి, మానసారెడ్డి ఇచ్చారు. ఎం.ఎస్తేరు గీత మాట్లాడుతూ రెండు జిల్లాల్లోని అన్ని గురుకుల పాఠశాలల్లో విద్యాభివృద్ధితోపాటు పిల్లల ఆరోగ్యంపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమెను ప్రిన్సిపాళ్లు దాదాఫీర్, రూత్ రోమోల, అధ్యాపకులు శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు



వాకాడు: అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణిరెడ్డి

వాకాడు/చిట్టమూరు (చిల్లకూరు) : ఆరేళ్లలోపు ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి ఆధార్ కార్డులు జారీ చేయాలని డీఎల్‌డీవో వాణిరెడ్డి ఆదేశించారు. ఆమె బుధవారం వాకాడు, చిట్టమూరు ఎంపీడీవో కార్యాలయాల్లో సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. త్వరలోనే మరో కేంద్రాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేలో భాగంగా మిస్సింగ్ సిటిజన్స్‌ను త్వరగా గుర్తించాలని తెలిపారు. అదేవిధంగా పీఏసీఎస్ ఈకేవైసీ, ఎన్‌పీసీఐ, ఎంఎస్‌ఎంఈ సర్వేలను ఈ నెలాఖరులోపు పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వాకాడు, చిట్టమూరు ఎంపీడీవోలు అన్నపూర్ణారావు, మనోహర్‌గౌడ్ మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి చందనాలంకరణ



బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బుధవారం చందనాలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. స్వామి వారి జన్మనక్షం స్వాతి సందర్భంగా మూలమూర్తికి చందనంతో అలంకరించినట్లు ప్రధానార్చకులు తెలిపారు. ఉదయం అభిషేకం, చందనం అలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం స్వామి వారు గరుడ వాహనంపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగారు.



శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రమాదకరంగా మలుపులు



చాకలపల్లి వద్ద ప్రమాదకంగా ఉన్న మలుపు



బాలాయపల్లి మండలం నిండలి వద్ద ఉన్న మలుపు

డక్కిలి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్లలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధానంగా వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని లింగసముద్రం రోడ్డు నుంచి నాయుడుపాళెం, చాకలపల్లి, పాతనాలపాడు, కొత్తనాళ్లపాడు, భీమవరం, దగ్గవోలు, వాక్యం, నిండలి గ్రామాల మీదుగా బాలాయపల్లి మండలం వెంకటరెడ్డి పల్లి గూడూరు–వెంకటగిరి రోడ్డు వరకు పదుల సంఖ్యలో మలుపులు ఉన్నాయి. వీటి వద్ద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. వాహనం దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పచ్చదనం పరుచుకున్న పొలాలు

సాగరమాల రోడ్డు నిర్మాణం వల్ల 13 రోజల క్రితం వరకు ముంపులో ఉన్న పొలాలు(ఫైల్)



ముంపు నీరు తగ్గిన తర్వాత నాట్లు వేయడంతో పచ్చగా ఉన్న పొలాలు



సాగరమాల రోడ్డు నిర్మాణం కారణంగా తీర ప్రాంతంలోని చింతవరం కొత్తపాళెం, చింతవరం గ్రామాల రైతుల భూములు రెండు నెలలుగా ముంపులోనే ఉండిపోయాయి. ఈ విషయంపై ఈ నెల 9న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు నీరు దిగువకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. నీరు తగ్గిపోవడంతో రైతులు వరినాట్లు చేపట్టారు. ఈ క్రమంలో భూములు పచ్చదనాన్ని పరుచుకుని కనువిందు చేస్తున్నాయి. బల్లవోలు గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లో ఇప్పటికీ నీరు అలాగే ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– చిల్లకూరు

క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న బ్యాంక్ అధికారులు

సూళ్లూరుపేట రూరల్ : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. ఆమె గురువారం సర్పంచ్ ఎద్దల చిన్నరాజా ఆధ్వర్యంలో సూళ్లూరుపేట మండలంలోని మన్నేముత్తేరి పంచాయతీలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కల పెంపకాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సాయికుమార్, మాజీ సర్పంచ్ చెంగయ్య, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడికి ఘన సన్మానం



సామంచి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నేతలు

నాయుడుపేట టౌన్ : బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సామంచి శ్రీనివాస్‌ను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, జిల్లా కోర్ కమిటీ సభ్యుడు ఆరణి విజయభాస్కర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. తిరుపతిలో బుధవారం జరిగిన బీజేపీ నాయకుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా సామంచి ఎన్నికయ్యారు. సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సూళ్లూరుపేట నియోజవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణ అధ్యక్షులు అత్తిరాల కిరణ్ కుమార్ గౌడ్, పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, తడ మండల అధ్యక్షుడు తేజారెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేకుండానే చెట్ల నరికివేత



చెట్లను నరికిన దృశ్యం

సైదాపురం: మండలంలోని సైదాపురం–పొదలకూరు రోడ్డులో అనుమతి లేకుండానే చెట్లను నరికివేయడంతో కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సైదాపురం –పొదలకూరు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్ అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ తనకు సంబంధం లేకపోయినా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికివేయాలని ఆదేశించారు. దీంతో కొందరు యంత్రాలతో పెద్ద పెద్ద చెట్లను నరికివేశారు. ఈ విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో నెల్లూరు అటవీశాఖ రేంజర్ మాల్యాద్రి ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ రవిశేఖర్ అక్కడికి చేరుకుని చెట్ల నరికివేతను నిలిపేశారు. యంత్రాలు, కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈని వివరణ కోరగా చెట్లు నరికేసిన విషయంపై తనకు ఇప్పుడే సమాచారం అందిందన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ చేస్తామని తెలిపారు.

కట్టుదిట్టంగా జేఈఈ మెయిన్ పరీక్షలు

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బుధవారం ప్రారంభమైన జేఈఈ మెయిన్ పరీక్షకు అధికారు లు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో విద్యార్థులకు సీబీటీ(కంప్యూటర్ బేస్ట్ టెస్ట్) విధానంలో ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఉదయం 85 మందికి గాను 81 మంది, మధ్యాహ్నం 88 మందికి గాను 85 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దూడ మృతి



మృతిచెందిన దూడ వద్ద వున్న తల్లి ఆవు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని వెంకటగిరి రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దూడ మృతి చెందింది. తల్లి ఆవు మృతి చెందిన దూడ చుట్టూ తిరుగుతూ మౌన వేదన అనుభవించింది. దాన్ని చూసి పలువురు చలించిపోయారు. పట్టణంలో ఆవులను వదిలి పెట్టవద్దని పలుమార్లు హెచ్చరించినా యజమానులు పట్టించుకోవడం లేదని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా వాపోయారు. ఆవులను రోడ్లపై నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల వాహనాలు ఢీకొని మృతిచెందుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆవులను ఇళ్ల వద్ద పెట్టుకుని సంరక్షించుకోవాలని సూచించారు.